వెంటాడుతున్న వరద కష్టాలు


పడవపై వేలేరుపాడు వస్తున్న రేపాకగొమ్ము గ్రామస్తులు


గొమ్ముగూడెంలో నిర్వాసితులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

- నెల తిరగక ముందే మళ్లీ గోదావరి ఉగ్రరూపం
- పొంగి ప్రవహిస్తున్న శబరి, తాలిపేరు, ఇంద్రావతి, ప్రాణహిత నదులు

వేలేరుపాడు: ఒక పక్క భారీ వర్షాలు, మరో పక్క గోదావరి వరద కష్టాలు వేలేరుపాడు మండల ప్రజలను వెంటాడుతున్నాయి. గత నెల రోజులుగా గిరిజన గ్రామాలను వణికించిన గోదావరి రెండు రోజుల క్రితం శాంతించి, గోదావరి వరద మళ్లీ మంగళవారం ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం రాత్రి 8.40 గంటలకు 49.9 అడుగులకు చేరింది. చత్తీస్‌ఘడ్, ఒరిస్సా రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో శబరి నది పొంగి ప్రవహిస్తోంది. తాలిపేరు ప్రాజెక్ట్ 27 గేట్లు ఎత్తి వేయడంతో నీరు గోదావరిలో కలుస్తోంది. ఉప నదులైన ప్రాణహిత, ఇంద్రావతి నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నదుల నీరు కూడా గోదావరిలో కలుస్తుండటంతో గోదావరి నీటిమట్టం ఉధృతంగా పెరుగుతుంది. దీంతో వేలేరుపాడు మండలంలోని 29 గిరిజన గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ఆయా గ్రామాల గిరిజనులు రెండు నెలలుగా వరదలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆగస్టులో జల దిగ్బంధంలో ఉన్న ఆయా గ్రామాల గిరిజనులు మరలా సెప్టెంబర్‌లో ఆ గ్రామాలను గోదావరి వరద ముంచెత్తడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి వరద వలన వేలేరుపాడు మండలంలోని మేళ్ళవాగు, ఎద్దెలవాగు, టేకూరు వాగులు, నీట మునిగాయి. వేలేరుపాడు నుంచి రుద్రమకోట వెళ్లే రహదారిలో పెద్దవాగు వంతెన ప్రాంతంలో రహదారి, వేలేరుపాడు నుంచి రేపాకగొమ్ము వెళ్లే రహదారి పూర్తిగా నీట మునిగింది. కన్నాయిగుట్ట జీలుగుచెరువు, పాత నార్లవరం, తదితర రహదారులు వరదలో నీట మునిగిపోవడంతో 29 గ్రామాలకు రాకపోకలు స్తంభించి పోయాయి. వేలేరుపాడు మండలానికి దిగువనున్న కొయిదా, కాచారం, టేకుపల్లి, కాకిస్‌నూరు, చిన మంకోలు,పెద్దమంకోలు, పేరంటపల్లి, టేకూరు, పూసుగొంది, తాళ్లగొంది, కట్కూరు, సిద్దారం, కుంకుడు కొయ్యలపాకలు, ఎడవల్లి, చిట్టంరెడ్డిపాలెం, ఎర్రతోగు, చిగురుమామిడి, బోళ్లపల్లి, పాత నార్లవరం, తూర్పుమెట్ట, కొత్తూరు, మరో ఎనిమిది గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. ఆయా గ్రామాలకు మండల కేంద్రంతో సంబంధాలు మంగళవారం రాత్రి నుంచే తెగిపోయాయి. ఎద్దెలవాగు వద్ద అధికారులు ఒక దేశీయ బోట్ ఏర్పాటు చేశారు.

వరద తగ్గే వరకు పునరావాస కేంద్రాల్లోనే కలెక్టర్ వెట్రిసెల్వి

కుక్కునూరు: గోదావరి నదికి వరద ముంపు పూర్తిగా తగ్గే వరకూ బాధితులను పునరావాస కేంద్రాల్లోనే ఉంచాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కుక్కునూరు మండలం దాచారంలోని ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ భద్రాచలం వద్ద గోదావరి నదికి వరద ఉధృతి ఎక్కువగా ఉందని, రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన దృష్ట్యా, ప్రజలు వరద ముప్పు పూర్తిగా తగ్గే వరకూ పునరావాస కేంద్రాల్లో ఉండాలన్నారు. వరదల కారణంగా తాము సర్వస్వం కోల్పోయామని, తమకు నిత్యావసర సరుకులు అందించాలని కోరారు. వింజరం, ముత్యాలంపాడు గ్రామాల్లో వరద ముంపునకు గురైన ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో కె.అద్దయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.బాబ్జి, తహసీల్దార్ చలపతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వరద విలయానికి చంద్రబాబే కారణం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కంభం విజయరాజు


కంభం విజయరాజు

చింతలపూడి: చంద్రబాబునాయుడు స్వార్థం వల్లనే విజయవాడ వరదల్లో చిక్కుకొని 50 మంది మృతి చెందడమే కాక లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కంభం విజయరాజు ధ్వజమెత్తారు. చింతలపూడిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ విజయవాడలో వరద విలయానికి చంద్రబాబే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విజయవాడకు వరద ముప్పు పొంచి ఉందని వాతావరణ నిపుణులు ముందుగానే హెచ్చరించినా కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందన్నారు. వరద ముప్పు గురించి ముందస్తు సమాచారం తెలిసినా లక్షలాది మంది ప్రజలను అప్రమత్తం చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందన్నారు. వరదకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించక పోవడం కారణంగా చాలా మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నివాసం, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ యాక్టివ్ పవర్‌ప్లాంట్ మునిగి పోకుండా బుడమేరు వరదను వెలగపల్లి రెగ్యులేటర్ నుంచి విడుదల చేయడంతో అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయన్నారు. దీంతో సుమారు 3 లక్షల మంది వరదల్లో చిక్కుకొని విలవిల్లాడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ప్రభుత్వం విఫలం చెందడంతో ప్రజలే ఎవరికి వారు సురక్షిత ప్రాంతాలకు చేరుకొని ప్రాణాలను కాపాడుకున్నారని తెలిపారు. వరద సహాయక చర్యల్లో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని విజయరాజు ఆరోపించారు. గత 10 రోజులుగా సరైన ఆహారం, త్రాగునీరు, పిల్లలకు పాలు వంటి కనీస అవసరాలు లభించక ప్రజలు అలమటిస్తున్నారన్నారు. ప్రజలకు కనీసం ఆహారం, నీరు అందించడం కూడ ఈ ప్రభుత్వానికి చేత కావట్లేదని విమర్శించారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు నాయుడుకు వరదల సమయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో కూడ తెలియదా అని ప్రశ్నించారు. అధికారులను వెంటేసుకొని ప్రెస్‌మీట్లు పెట్టి చేతులు దులుపుకుంటున్నారన్నారు. హంగు ఆర్భాటాలకు ప్రాధాన్యత ఇచ్చి బాధితులను పూర్తిగా వదిలేశారని విమర్శించారు. వరద బాధితుల సహాయార్థం దాతలు అందిస్తున్న విరాళాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. చంద్రబాబు ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, సహాయక చర్యలు చేపట్టాలని హితవు పలికారు.

పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన

కుక్కునూరు: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (ఏపీపీహెచ్‌సీడీఏ) వైద్యులు జీవో85కి వ్యతిరేకంగా తమ ఆందోళనను వ్యక్తం చేశారు. కుక్కునూరు డివిజన్ వైద్యులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో ద్వారా తమ మూడేళ్ల సర్వీసు అర్థం లేకుండా పోయిందన్నారు. అమరవరం వైద్యులు అనంత్, శ్రీకాంత్ నల్ల బ్యాడ్జ్‌లు ధరించి విధులు నిర్వహించారు.

నల్లబాడ్జీలతో నిరసన

పోలవరం రూరల్: వైద్యుల సమస్యలు పరిష్కరించాలని జీవో 85 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పోలవరం మండలంలోని వింజరం, ఎల్ఎన్‌డీపేట పీహెచ్‌సీలో వైద్యాధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. వైద్యాధికారులు కె.మురళీధర్, కె.నిఖిల్‌లు నల్లబాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు.

క్లుప్తంగా

పోషణ మాసోత్సవాలు

జంగారెడ్డిగూడెం: సుబ్బంపేట కోడ్ నెంబర్ 82లో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీవో పి.బ్యూలా పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు, తల్లులకు తృణధాన్యాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. తృణధాన్యాలు ఆహారంలో తీసుకోవడం వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో తృణ ధాన్యాలు ప్రదర్శించి, తయారు చేసిన ఆహార పదార్థాలను తల్లులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్స్ లీల రత్నకుమారి, కృష్ణకుమారి, మేరీ, తదితరులు పాల్గొన్నారు.

వరద నష్టం వివరాలు ఇవ్వండి

చింతలపూడి: వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న పంటలు, రహదారులపై సంబంధిత అధికారులు నివేదికలు తయారు చేసి ఇవ్వాలని డీఈవో అబ్రహం ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని నష్ట తీవ్రత వివరాలు సేకరించాలన్నారు. మండల అధికారులు ఇచ్చిన నష్టం వివరాలను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్, అధికారులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వమే నిర్వహించాలి

కామవరపుకోట: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని అలాగే స్టీల్ ఫ్యాక్టరీని ప్రభుత్వ యాజమాన్యంలో నిర్వహించాలని సీపీఐ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కామవరపుకోట కొత్తూరులో జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు ప్రధాన రహదారిపై సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను సీపీఐ, ఏఐటీయూసీ తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కోటిగంటి సోమరాజు, భీమయ్య, ఆర్.బాలరాజు, దుర్గాప్రసాద్, గోవిందరాజు, వెంకన్న, శేషం రాజు, తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

జంగారెడ్డిగూడెం: వరద బాధితులను ఆదుకునేందుకు విరివిగా విరాళాలివ్వాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. వరద విపత్తు నుంచి ప్రజలు రక్షించడానికి మేము సైతం అంటూ ప్రజలు రాజకీయాలకు అతీతంగా స్పందించి స్వచ్ఛందంగా సహాయం అందించాలని ఆయన కోరారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం జంగారెడ్డిగూడెం పట్టణంలో విరాళాల సేకరణ ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి నేతృత్వంలో మండల నాయకత్వ బృందం ఇంటింటికి తిరిగి విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు, సహాయ కార్యదర్శి కుంచె వసంతరావు, మండల కమిటీ సభ్యులు గొలిమే బాలయేసు, పొడపాటి ఘటోత్కచుడు, కంకిపాటి రామారావు, భూదే ఆశీర్వాదం తాళ్లూరి నాగరాజు, హనుమంతు, శ్రీను ,తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో..

వరద బాధితులను ఆదుకోవడానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావడం అభినందించదగ్గ విషయమని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో 25,800 రూపాయలను విరాళాల రూపంలో వసూలు చేసినట్లు సీపీఐ మండల కార్యదర్శి కె.గురవయ్య తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎం వసంతరావు, మండల సహాయ కార్యదర్శులు పి సోమశేఖర్, టి బాబు, ఎస్‌కె మస్తాన్, ఎం నాగేశ్వరరావు, నరశింగ రామారావు, తలారి గంగరాజు, రైతు సంఘం నాయకులు టి ప్రసాదరావు, టిమాణిక్యాలరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కుక్కునూరు: భారీ వర్షాల కారణంగా జిల్లాలో అనేక గ్రామాలు నీటమునిగి బురదమయం అవ్వడంతో జిల్లా వ్యాప్తంగా రెండు వారాలు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. మంగళవారం పారిశుద్ధ్య కార్యక్రమాలను డీపీవో ఆకస్మిక తనిఖీ చేశారు. డీపీవో తాగునీటి స్కీమ్‌ను పరిశీలించి, ప్రధాన వాల్వ్ చాంబర్ పరిశీలించారు. అన్ని గ్రామ పంచాయతీలలో 15వ ఆర్థిక సంఘం నిధులున్నాయని వినియోగించుకోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రత్యేక అధికారి వెంకట ప్రసాద్, డీఎల్‌పీవో రజావుల్లా, ఈవోపీఆర్డీ నరసింహారావు, కార్యదర్శి మోహనరావు, పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కొయ్యలగూడెం: పేకాట స్థావరంపై కొయ్యలగూడెం పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. మండలంలోని కన్నాపురంలో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.61,800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

భూస్వాములపై చర్యలకు వినతి


పొగాకు బోర్డు ఆక్షన్ సూపరింటెండెంట్ శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

జంగారెడ్డిగూడెం: ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భూములు అమ్ముకుని ఇప్పటికీ బేరన్లు అక్రమంగా అనుభవిస్తున్న గిరిజనేతర భూస్వాములపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం నేతల బృందం పట్టణంలోని పొగాకు వేలం కేంద్రం వద్ద పొగాకు బోర్డు ఆక్షన్ సూపరింటెండెంట్ శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నిర్వాసితులకు భూమికి భూమి, పునరావాసం కోసం సేకరించిన భూములలో ఉన్న బ్యారన్‌లను అమ్మిన వారే తిరిగి అక్రమ పద్ధతిలో లీజు చేస్తున్నారన్నారు. బుట్టాయగూడెం మండలం దొరమామిడి కోయిదా పునరావాస కాలనీల సమీపంలో 20 బ్యారన్‌లను ఆర్అండ్ఆర్ ప్యాకేజిలో గిరిజనేతరులు అమ్మేశారని గుర్తు చేశారు. దొరమామిడి గ్రామ రెవెన్యూ పరిధిలో గల సర్వే నెం.437, 446లలో 20 బ్యారన్లు అక్రమ పద్ధతిలో కొంత మంది దళారీలు, గిరిజనేతరులు బ్యారన్లు వినియోగిస్తున్నారు. ఆర్అండ్ఆర్‌లో కొనుగోలు చేసిన భూమిని కొంతమంది దళారీలు పొగాకు బోర్డు రిజిస్ట్రేషన్ చేయించుకుని లీజ్‌లకు ఇస్తూ సొమ్ము తీసుకుంటున్నారని వెంటనే పొగాకు బోర్డు ఆ రిజిస్ట్రేషన్లను ఆపాలన్నారు. అనంతరం పొగాకుబోర్డు ఆక్షన్ సూపరింటెండెంట్ శ్రీహరి మాట్లాడుతూ సంబంధిత బ్యారన్‌లను పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ బృందంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు మొడియం నాగమణి, మండల నాయకులు పోలోజు నాగేశ్వరావు, కారం భాస్కర్, బొడ్డు రాంబాబు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ఎం.ముక్కంటి

జంగారెడ్డిగూడెం: వర్షాలు, వరదలు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని జంగారెడ్డిగూడెం మండల ప్రత్యేక అధికారి ఎం.ముక్కంటి అన్నారు. జంగారెడ్డిగూడెంలో మండల ప్రత్యేక అధికారి కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్కంటి మాట్లాడుతూ అధిక వర్షాలు, వరదలు నేపథ్యంలో ప్రతీ ఒక్క అధికారి అప్రమత్తంగా ఉండాలన్నారు. వీఆర్‌వోలు, కార్యదర్శులు పంచాయతీల్లో అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, ప్రజల ఆరోగ్యం తదితర విషయాలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

గణేష్ నిమజ్జనానికి ప్రత్యేక చర్యలు: జంగారెడ్డిగూడెం మండలంలో ప్రతీ గ్రామంలో వినాయక విగ్రహాలు నెలకొల్పారని, ఆయా విగ్రహాలను నిమజ్జనం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులు తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలు సందర్భంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు పని చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంపీడీవో జీవీ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం కోసం ఆందోళన


ఆందోళన చేపట్టిన సీపీఎం శ్రేణులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పట్టిన్నపాలెంలో జల్లేరు వాగుపై నిలిచిపోయిన వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు ఎ. సూర్య కిరణ్, జోడే సూర్య చంద్రరావులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలకు ప్రధాన రహదారి అయిన పట్టిన్నపాలెంలో జల్లేరు వాగుపై వంతెన నిర్మాణం పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులు విద్య, వైద్య, తదితర అవసరాల కోసం జంగారెడ్డిగూడెం రావాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వంతెన పనులు ప్రారంభించకుంటే ఆర్డీవో, కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు ఎ.ప్రభాకరరావు, సీపీఎం నాయకులు పిల్లి పోతురాజు, బి. వసంతరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

పోలవరం రూరల్: మండల పరిషత్ సమావేశానికి మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో హాజరు కాకపోతే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం మండల పరిషత్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. మైనర్ ఇరిగేషన్ డీఈ కె.వర ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇసుక కాలువకు ఏడు గండ్లు, పేద్రాల కాలువకు ఐదు గండ్లు, తానాలకుంట, మంగపతిబోదిలకు ఒక్కొక్క గండి పడ్డాయన్నారు. గండ్లు పరిశీలించామని, ప్రతిపాదనలు పంపామన్నారు. సమావేశంలో ఎంపీడీవో జి.శ్రీను, తహసీల్దార్ బీఎస్ఆర్ ఎల్‌రాజు, ఏవో కె.రాంబాబు, ట్రాన్స్‌కో ఏఈ సత్యనారాయణ, వైద్యాధికారి జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వీరబాబు, ఈవోపీఆర్‌డీ కె.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, ఎంపీటీసీలు మిడియం సింగరాజు, కాశీ ధనలక్ష్మి, యామల శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

బాలికల భద్రతపై అవగాహన

కామవరపుకోట: మండలంలో రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రముఖ కోకో లైఫ్ కంపెనీలు ఏలూరు ప్రతినిధులు రాజేష్, అశోక్ ఆధ్వర్యంలో భద్రత పరిరక్షణ, ఆరోగ్యం, సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ పుష్పావతి మాట్లాడుతూ బాలికలు తమ రక్షణకు పరిష్కార మార్గాలు, బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై విద్యార్థినులకు వివరించారు. హెల్ప్ లైన్ నెంబర్ 1098కి, 100, 181, 112లకు ఫోన్ చేయొచ్చని తెలిపారు.

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా,,!


ద్వారకాతిరుమల: కాంతార వేషధారణల నడుమ ఊరేగింపు


చింతలపూడి: గణపతి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

కొయ్యలగూడెం: వినాయక చవితి వేడుకల సందర్భంగా మంగళవారం నాలుగవ రోజు గణనాథుని ఊరేగింపు, అన్నదాన కార్యక్రమాలు మండల వ్యాప్తంగా గణేష్ శిబిరాలలో ఘనంగా నిర్వహించారు. బుట్టాయిగూడెం మండలం దుద్దుకూరలో ఏర్పాటు చేసిన గణపతి శిబిరంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు రాజ్యలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు లడ్డూ వేలం నిర్వహించారు. దీనిలో లడ్డూను వేలం ద్వారా దక్కించుకున్న భక్తురాలకి ఎమ్మెల్యే దంపతులు లడ్డూను అందజేశారు.

జంగారెడ్డిగూడెం: వినాయక చవితి వేడుకల్లో గణనాధులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆయా పందిళ్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద భక్తులు ఉభయదారులుగా వ్యవహరించి, పూజా కార్యక్రమాలు చేస్తున్నారు. పట్టణంలో కొలువైన విజయదుర్గమ్మ ఆలయంలో కమిటీ ఛైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, సహాయ కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చిట్టూరి కిరణ్ కుమార్ దంపతులు, వాసా పెంటయ్య దంపతులు పూజా కార్యక్రమాల్లో ఉభయదారులుగా వ్యవహరించారు. కమిటీ ప్రధాన కార్యదర్శి మాడా రామ మోహన్‌రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శ్రీ సిద్ది వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్మెల్‌పురంలోని వినాయకుడి విగ్రహానికి భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


పోలవరం: కార్మెల్‌పురంలో నెలకొల్పిన వినాయకుడు


టి.నరసాపురం: వేలంలో దక్కించుకున్న లడ్డూ

చింతలపూడి: వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా చింతలపూడి ఆంజనేయ స్వామి గుడి ప్రాంగణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మహాగణపతిని భక్తులు భక్తి శ్రద్ధలతో పూజించారు. ఉత్సవాల్లో చిల్లపల్లి రామ్మోహన్‌రావు, విజయలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

టి.నరసాపురం: రాజుపోతేపల్లి గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి 35 కిలోల లడ్డూని వేలం వేయగా, గ్రామానికి చెందిన దావులూరి సూర్యనారాయణ రూ.91,116కు దక్కించుకున్నారు. లడ్డూను సూర్యనారాయణ దంపతులు భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు.

వినాయకా.. సెలవిక

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో గణేష్ నిమజ్జన వేడుక మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. వ్యాపారులు గణపతికి విశేష పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన అశ్వ రథంలో స్వామివారిని ఉంచి, చిత్ర విచిత్ర, శక్తి వేషధారణలు, బాణాసంచా కాల్పులు, డీజే సందళ్లు, యువకుల ఆనందోత్సాహాల నడుమ గణేషుడు క్షేత్ర పుర వీధుల్లో ఊరేగించారు. శక్తి వేషధారణలు, స్వామివారి అశ్వ రథం చూపరులను ఆకట్టుకున్నాయి. రాత్రి గణేష్ నిమజ్జనను స్థానిక కోనేరులో ఘనంగా నిర్వహించారు.


కొయ్యలగూడెం: భక్తులకు లడ్డూ అందజేస్తున్న దృశ్యం


జంగారెడ్డిగూడెం: విజయదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

12 నుంచి ఆటల పోటీలు

లింగపాలెం: ఈ నెల 12 నుంచి 14 వరకు విద్యార్థులకు మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల క్రీడల సమన్వయ అధికారి సీహెచ్‌వీ ప్రకాష్ రెడ్డి తెలిపారు. మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల నిర్వహణపై మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం ధర్మాజిగూడెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మండల స్థాయి పోటీలు ఈ నెల 12, 13, 14 తేదీలలో జిల్లా పరిషత్ హైస్కూల్, సింగగూడెం నందు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి అలివేలు మంగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12 నుంచి 'మద్ది' పవిత్రోత్సవాలు

జంగారెడ్డిగూడెం రూరల్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రముఖ హనుమాన్ క్షేత్రమైన జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో ఈనెల 12 నుంచి 15 వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. అత్యంత వైభవంగా పవిత్రోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పవిత్రోత్సవాల్లో భాగంగా 12వ తేదీ మధ్యాహ్నం 1 గంట నుంచి గర్భాలయ దర్శనం నిలిపివేస్తామని, తిరిగి 15వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గర్భాలయం దర్శనం పునః ప్రారంభిస్తామని ఈవో తెలిపారు.

మద్ది క్షేత్రానికి భక్తుల తాకిడి

మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రాన్ని మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఒక్కరోజు ఆదాయం రూ:1,04,100 వచ్చినట్లు, 1200 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు.